## ఆపదకాలంలో 'ఆప్తా'

జీవిక కోసం ఖండాలు దాటిన ఎన్నారైలు తెలంగాణ పల్లె కష్టాలు వింటున్నారు. కరోనా రాగానే ఎక్కడివాళ్లు అక్కడే ఉండిపోయారు. అప్పుడు వాళ్ల దిగులంతా తమ కన్నవాళ్ల గురించే! అమెరికాలో ఉన్నవాళ్లే కాదు, ఒకే దేశంలో ఉన్నా.. పట్నంలో ఉన్నవాళ్లు పల్లెల్లో ఉన్న తమ తల్లిదండ్రులను చేరుకోలేని పరిస్థితులు అవి. ఆ సమయంలో తమ తల్లిదండ్రుల కోసం బిడ్డల్లాగే సేవచేసే వలంటీర్లను తయారు చేసేపని ఫిలడెల్ఫియా తెలంగాణ అసోసియేషన్ చేపట్టింది. కేర్ టేకర్, నర్స్, అటెండెంట్స్ ఏర్పాటుచేసి అయినవారికి కావాల్సిన సాయం అందించే పని మొదలుపెట్టింది. కేర్ టేకర్స్‌కు ఈ సంస్థ శిక్షణ అందించింది. పెద్దల యోగక్షేమాలు చూసుకోవడం, వాళ్ల సమస్యలను అర్థం చేసుకోవడంలో శిక్షణ పొందిన సిబ్బందితో 'ఆప్తా ఎల్డర్ కేర్'.. హైదరాబాద్‌లో ఇప్పటికీ కొనసాగుతున్నది. అమ్మానాన్నలకు దూరంగా ఉన్న బిడ్డలు ఈ సేవలు వినియోగించుకోవచ్చు.

## ముఖ్యమంత్రికి ఓ లేఖ

'శ్రీయుత గౌరవనీయులైన తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి గారికి నమస్కారములు,

మా ఇప్పటూర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలకు పక్క గ్రామాల నుంచి విద్యార్థులు వస్తారు. వారికి బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. కావున మా ఊరికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నాము. మా సమస్యలను వీలైనంత తొందరగా పరిష్కరించాలని కోరుతూ...' అయిదో తరగతి చదువుతున్న నవీన్ రాసిన లేఖ ఇది. ఇప్పటూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న నవీన్ ఒక్కడే కాదు... మరెందరో విద్యార్థులు తమ పాఠశాలల్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రికి ఇటీవల లేఖలు రాశారు. దాదాపు ఇరవైవేల మంది విద్యార్థులు బాగా చదువుకోవడానికి సరైన వసతులు కల్పించాలని కోరుతూ ఉత్తరాలు పంపించారు. విద్యార్థుల పట్ల సానుభూతి ఉన్నవాళ్లకు ఇది మంచి పనే అనిపిస్తుంది. ప్రభుత్వంపట్ల అభిమానం, భక్తి ఉన్నవాళ్లు ఈ పని చేయిస్తున్నవాళ్లు ఉత్తగా ఉత్తరాలు రాయడమేనా, ఏదైనా చేసేదుందా అని రాజభక్తిని చాటుకునేందుకు ప్రయత్నిస్తారు. డయల్ యువర్ విలేజ్ ఈ ఉత్తరాలు రాయించింది. ఇది పల్లె గుండె చప్పుడు వినే సంస్థ. పేద విద్యార్థికి అండగా ఉండే సంస్థ. విద్యార్థుల్లో ఆశలు రేకెత్తించి, చదువులో ఉరకలెత్తించాలని భావించే సంస్థ. విద్య కోసం, విద్యాహక్కు కోసం విద్యార్థుల్లో చైతన్యం కలిగిస్తూ 20 వేల మందితో పోస్టుకార్డులు రాయించింది. ఆ ముఖ్యమంత్రి వస్తాడని, ఏదో చేస్తాడని ఎదురుచూడకుండా ఆ విద్యార్థులకు అవసరమైన చేయూతను అందిస్తున్నారు అమెరికాలో ఉండే తెలంగాణ ఎన్నారైలు.

## పల్లెకు పోదాం



మాది వనపర్తి జిల్లాలోని ఖిల్లా ఘన్‌పూర్ మండలం, మానాజీ పేట. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చదివాను. పీహెచ్‌డీ చేశాను. చెల్లె పెళ్లి తర్వాత అప్పులయ్యాయి. ఆసక్తి లేకున్నా ఆ అప్పులు తీర్చడం కోసం 1992లో అమెరికాలో అడుగుపెట్టాను. రెండేండ్లు చాలా కష్టపడాల్సి వచ్చింది. అక్కడ నిలదొక్కుకున్న తర్వాత నా తెలంగాణ కోసం మాట్లాడిన, కొట్లాడిన. వచ్చిన తెలంగాణ కోసం ఇప్పుడూ మాట్లాడుతున్న. సాటి ఎన్నారైలతో కలిసి తెలంగాణ పల్లెల కోసం పనిచేస్తున్నం. ఇది తెలంగాణ ఎన్నారైల సమష్టి కృషి. ఇప్పుడు ఊళ్లను చూస్తే బాధేస్తున్నది. ఒకప్పటి ఊళ్లు కావు. ఆశ లేవు. ఆశయాల్లేవు. తాగుబోతులు పెరిగారు. కొట్లాటలు పెరిగాయి. చదువుకున్నవాళ్లు ఊళ్లను వదిలిపెడితే వచ్చిన సమస్య ఇది. పట్నాలకు పోయినా మనం పల్లెను పట్టించుకోవాలె. పోయిన ఏడాది వచ్చి ఊళ్లో ఉన్న. స్కూళ్లల్లో పడుకున్న. ఊరి కష్టాలు తెలిసినయి. పోయిన ఆగస్టులో వచ్చి పది రోజులు నారాయణపేట, గద్వాల్ సమీప గ్రామాల్లో పదమూడు రోజులు యాత్ర చేసిన. సీడ్ పత్తి ఏరడం కోసం విద్యార్థులు రెండు నెలలు బడికి పోవడం లేదు. ఇంత దయనీయ స్థితిలో చదువులు ఉన్నాయి. ఈ పరిస్థితులు మార్చాలన్నదే మా ఆశ. ఆశయం.

**- మేరెడ్డి రవిప్రకాశ్ రెడ్డి,**
తెలంగాణ ఎన్నారై





వస్తుంది. అలాగే ప్రతిరోజూ ఒక సూక్తిని నేర్చుకోవాలని కొన్ని సూక్తులు డైరీలో ముద్రించారు. దినచర్య, ఇతరులకు చేసిన సాయం, చదువు, ప్రయాణం, స్నేహాలు, నేర్చుకున్న విషయాలను డైరీలో రాయడం అలవాటు చేస్తున్నారు. ఈ డైరీలోని దినచర్య ఆధారంగా ఎక్కడ తప్పు చేస్తున్నారు, ఎన్ని మంచిపనులు చేస్తున్నారో విద్యార్థి తనకు తానుగా తెలుసుకుని, తనను తాను మలుచుకోవాలన్నది నిర్వాహకుల ఉద్దేశం. వాళ్ల ఆశలు వమ్ము కాకుండా ప్రభుత్వ పాఠశాలల పిల్లలు క్రమశిక్షణతో డైరీ రాస్తున్నారు.



### పేద చదువుకు పెద్ద భరోసా

డయల్ యువర్ విలేజ్ విజయం అమెరికా ఎన్నారైలకు ఉత్సాహాన్నిచ్చింది. ఇక్కడి విద్యార్థుల బాధలు వినడమే కాదు వాళ్ల కష్టాలను కలిసి పంచుకుందామని ఫిలడెల్ఫియాలోని తెలంగాణ ఎన్నారైలు నిర్ణయించుకున్నారు. ప్రతిభకు పేదరికం అడ్డుకారాదని గ్రామీణ, పేద విద్యార్థులకు భరోసా ఇచ్చారు. చదవాలనే ఆశ, పేదరికాన్ని గెలవాలనే పట్టుదల ఉన్న పేద వైద్య విద్యార్థులకు ఆర్థిక సాయం చేయడానికి ముందుకొచ్చారు. వైద్య కళాశాలలో సీటు వచ్చిన పేద వైద్య విద్యార్థి ఫిలడెల్ఫియా ఎన్నారై అసోసియేషన్‌కు దరఖాస్తు చేసుకుంటే వాళ్లకు బ్యాంకులు రుణం ఇచ్చిన విధంగా (ఆస్తుల తనఖా లేకుండా) రుణం ఇస్తారు. 'చదువు పూర్తయ్యాక ఉద్యోగం చేస్తూ మీ రుణం తీరుస్తాను' అని విద్యార్థితో బాండ్ రాయించుకుంటారు. వాళ్ల తర్వాత కాలంలో అప్పు తీర్చేందుకు ఇచ్చిన డబ్బుల్ని మరో పేద విద్యార్థి చదువుకునేందుకు సాయంగా అందిస్తున్నారు. ఇలా చేయడం వల్ల మరింత మందికి మద్దతుగా నిలవొచ్చని ఫిలడెల్ఫియా తెలంగాణ అసోసియేషన్ ఉద్దేశమని మేరెడ్డి రవిప్రకాశ్ చెబుతున్నారు. ఈ విద్యా లక్ష్యానికి పాలమూరు ఎన్నారై ఫోరం కూడా చేదోడుగా నిలుస్తున్నది. అలా ఈ ప్రవాసుల సంకల్పం తెలంగాణ పల్లెలకు కొత్త వసంతాన్ని తీసుకొస్తున్నది.